
## భూప్రకంపనల కలకలం

- 5 సెకన్ల పాటు స్వల్పంగా కంపించిన భూమి
- భయాందోళనకు గురైన ప్రజలు



మంచిర్యాలటౌన్/చెన్నూర్/లక్షెట్టిపేట/మందమర్రి/దండేపల్లి/హాజీపూర్/కోటపల్లి/జన్నారం, డిసెంబర్ 4: మంచిర్యాల జిల్లాలో భూప్రకంపనలతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంతో పాటు చెన్నూర్, లక్షెట్టిపేట, మందమర్రి, హాజీపూర్, జైపూర్, కోటపల్లి, దండేపల్లి, జన్నారం తదితర మండలాల్లో ఉదయం 7:25 గంటల సమయంలో 3 నుంచి 5 సెకన్ల పాటు భూమి కంపించింది. ఇండ్లలో ఉన్న వంట పాత్రలు, కిటికీలు, కుర్చీలు, తదితర సామగ్రి కదలడాన్ని గమనించిన ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. సింగరేణి పరిసర ప్రాంతాల వారు ఓసీపీలో బ్లాస్టింగ్‌లతో ప్రకంపనలు వచ్చి ఉంటాయని మొదట భావించారు. ఆ తర్వాత భూకంపమని తెలుసుకొని భయాందోళనకు గురయ్యారు. భూప్రకంపనలు దృశ్యాలు పలువురి ఇండ్లల్లోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. కొన్ని సెకండ్లకే భూప్రకంపనలు ఆగిపోవడం, ఎలాంటి నష్టం జరగక పోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## మేడం.. మాకు రుణ మాఫీ కాలేదు


సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు విన్నవిస్తున్న రైతులు

బెజ్జూర్, డిసెంబర్ 4 : 'రూ.2 లక్షలు పంట రుణం మించిన వారికి రుణమాఫీ కావడం లేదు..దయచేసి మాకు రుణమాఫీ చేయండి మేడం' అంటూ బెజ్జూర్ మండలంలో పలు గ్రామాల రైతులు కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు విన్నవించారు. బుధవారం బెజ్జూర్ ఎంపీడీవో కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం రుణమాఫీ కాలేదంటూ అక్కడికి వచ్చిన పలువురు రైతులు ఆమెకు సమస్యలను విన్నవించారు. ఆమె వెంటనే స్పందించి తహసీల్దార్ భూమేశ్వర్‌తో మాట్లాడి ఎందుకు రుణమాఫీ కాలేదో తెలుసుకొని రెండు రోజుల్లో సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.


జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన రామగుండం మాజీ ఎమ్మెల్యే చందర్


సీసీసీ నస్పూర్ : సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన బీఆర్‌ఎస్ నాయకులు

# నిర్బంధకాండ

**సీఎం సభ రోజు అరెస్టుల పర్వం ● పోలీసు స్టేషన్‌లకు తరలింపు**


వేమనపల్లి : నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ యూత్ నాయకులు


మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రాంపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్‌ను అరెస్ట్ చేసి కోటపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

రేవంత్ సర్కారుపై వ్యతిరేకత పెరుగుతున్నందున, ఈ వ్యతిరేకత బయటపడకుండా ఉండేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాలకు తెరలేపింది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సభలో ఒక మహిళ సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీయగా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ నాయకులను ముందుస్తుగా అరెస్టులను చేయించింది. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఆరు హామీలను అమలు చేయకపోవడంతో ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం అవుతున్నది. ఈ నిరసనలను పక్కన పెట్టి రేవంత్ సర్కారు ప్రజాపాలన పేరిట విజయోత్సవ సభలను నిర్వహిస్తున్నది. ఈ సభల్లోనూ నిరసన వ్యక్తం అవుతుండడంతో సర్కారు తలలు పట్టుకుంటున్నది. ప్రజల నుంచి నిరసనలు రోజురోజుకు పెరుగుతుండగా.. సీఎం రేవంత్ సభలతోపాటు కాంగ్రెస్ నాయకుల పర్యటనలోను జనాల నుంచి వ్యతిరేకత ఎదురు అవుతుండడంతో ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సభ పెద్దపల్లిలో ఉండగా బీఆర్‌ఎస్ నాయకులు సభకు వెళ్లకుండా ఉండేందుకు మంచిర్యాల జిల్లాలోని బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి వారి ఆధీనంలో ఉంచుకున్నారు.

- మంచిర్యాల, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి)


హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో..


కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో..


తాండూర్ : మాదారం పోలీస్ స్టేషన్‌లో..


భీమారం పోలీస్‌స్టేషన్‌లో..

# ఆశ్రమం.. అధ్వానం

**కంపుకొడుతున్న టాయిలెట్లు.. పురుగులు పట్టిన బియ్యం**

- బీఆర్‌ఎస్వీ 'గురుకుల బాట'లో వెలుగులోకి
- లోనికి వెళ్లనీయకుండా నాయకులను అడ్డుకున్న పోలీసులు

ఆశ్రమ పాఠశాలలో బియ్యం బస్తాలపై పురుగులు



సరైన డోర్లు లేకుండా అధ్వానంగా టాయిలెట్స్



కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో గుణాత్మకమైన విద్య అందడం అటుంచి కనీసం పరిశుభ్రమైన వాతావరణం కూడా లేని దుస్థితి నెలకొన్నది. పేద విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన పౌష్టికాహారం అందించాల్సిన ఆశ్రమ పాఠశాలలు అధ్వానంగా మారాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇటీవల వాంకిడి ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురైన వారిలో విద్యార్థిని శైలజ మృతి చెందిన నేపథ్యంలో బీఆర్‌ఎస్ యూత్ నాయకులు చేపట్టిన 'గురుకులాల బాట'లో విస్తుపోయే విషయాలు బయటపడుతున్నాయి. బుధవారం తిర్యాణి మండల కేంద్రంలోని బాలిక గురుకుల పాఠశాల, ఆశ్రమ పాఠశాలను బీఆర్‌ఎస్వీ నాయకులు సందర్శించారు. నాయకులు వస్తున్నారనే విషయం ముందుగా తెలుసుకున్న పోలీసులు ఆశ్రమ పాఠశాల వద్ద బందోబస్తు నిర్వహించారు. నాయకులను లోనికి వెళ్లనీయకుండా గేటు వద్దే అడ్డుకున్నారు. అతి కష్టం మీద పాఠశాలలోకి నాయకులు వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో టాయిలెట్లు, మరుగుదొడ్లు, బాత్‌రూంలు కంపు కొడుతున్నాయి. వాటికి సరైన తలుపులు కూడా లేవు. బియ్యం సంచులపై పురుగులు పారుతున్నాయి. ఇది చూసి ఆశ్రమ పాఠశాల నిర్వహణపై బీఆర్‌ఎస్వీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ నాయకుడు ముస్తఫా మాట్లాడుతూ విద్యార్థులకు సరిగ్గా ఉడకని భోజనం పెడుతున్నారని, బాత్‌రూంలు, టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉండి వినియోగించలేకుండా ఉన్నాయన్నారు. సెప్టిక్ ట్యాంకులకు వెళ్లే పైపులు సైతం పగిలి ఉండడంతో పాఠశాల ఆవరణ పూర్తిగా దుర్వాసన వస్తున్నదన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆశ్రమ పాఠశాలలో సమస్యలు పరిష్కరించకపోతే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అనంతరం మండల కేంద్రంలోని బాలిక గురుకులంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా అక్కడ కూడా పోలీసులు అడ్డుకున్నారు. వారిని తప్పించుకొని లోనికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. గురుకులాల బాట కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్వీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

## అన్ని సక్రమంగా ఉంటే గేట్లకు తాళాలు ఎందుకు?



మందమర్రి ఎస్సీ బాలుర వసతి గృహం గేటు ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

మందమర్రి, డిసెంబర్ 4: విద్యార్థులకు అన్ని వసతులను సక్రమంగా కల్పిస్తే వసతి గృహ సందర్శనకు వచ్చిన తమను ఎందుకు అడ్డుకుంటున్నారని, గేట్లకు తాళాలు ఎందుకు వేశారు అని ? అధికారులను బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు చెన్నమల్ల చైతన్య, బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్, యూత్, విద్యార్థి, సోషల్ మీడియా నాయకుడు భట్టు రాజ్‌కుమార్ ప్రశ్నించారు. 'గురుకుల బాట' కార్యక్రమంలో భాగంగా బుధవారం మందమర్రిలోని రెండవ జోన్ కాలనీలోని ఎస్సీ బాలుర వసతి గృహ సందర్శనకు నాయకులతో కలిసి వెళ్లారు. వసతి గృహం గేటుకు వార్డెన్ తాళం వేసి అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గేటు ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. కిటికీలో నుంచి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శాంతియుతంగా వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులకు సమస్యలను తెలుకునేందుకు వస్తే గేటుకు తాళం వేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలనే ఆశయంతో వెయ్యికి పైగా గురుకులాలను ఏర్పాటు చేశారని తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో ఏ నాడూ ఫుడ్ పాయిజన్ ఘటనలు జరగలేదన్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే అనేక మంది విద్యార్థులు అస్వస్థతకు గురి కావడం, 50 మంది విద్యార్థులు మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి, విద్య అందే వరకు పోరాడుతామన్నారు. బీఆర్‌ఎస్, సీనియర్ నాయకుడు కొంగల తిరుపతి రెడ్డి, యూత్, సోషల్ మీడియా నాయకులు తోట సురేందర్, ముస్తఫా, దాసరి నవీన్, బెల్లం అశోక్, సీపెల్లి సాగర్, అఖిలేశ్ పాండే, అందె శ్రీకాంత్, రామ్ శేఖర్, గుజిగంటి శేఖర్, తోట సన్ని, ఎండీ ఇమ్రోజ్, సంపత్, తిరుపతి, సుధాకర్, తొగరి లింగమూర్తి, సంగర్తి సంతోష్, శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

## కాంట్రాక్టు కార్మికులకు అండగా ఉంటాం

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

రెబ్బెన, డిసెంబర్ 4: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు అండగా ఉంటామని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. బెల్లంపల్లి ఏరియా లోని గోలేటిటౌన్‌షిప్ వద్ద తెలంగాణభవన్(టీబీజీకేఎస్ కార్యాలయం)లో బుధవారం సాయంత్రం కాంట్రాక్టు కార్మికుల బెల్లంపల్లి ఏరియా మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా మిర్యాల రాజిరెడ్డి హాజరై మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించే విధంగా మినిమం వేజ్ పెంపుకోసం కృషి చేస్తామన్నారు. కార్మికులకు రావాల్సిన అన్ని హక్కుల సాధన కోసం టీబీజీకేఎస్ యూనియన్ అండగా ఉంటుందన్నారు. కార్మికుల సమస్యలు, డిమాండ్లపై పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు, కాంట్రాక్టు కార్మిక సంఘం ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, కేంద్ర కమిటీ సభ్యులు ధరావత్ మంగీలాల్, మాంతు సమ్మయ్య, చంద్రశేఖర్, శ్రీనివాస్, ఓరం కిరణ్, సంపత్, పిట్ కార్యదర్శి రమేశ్, గణపతి, మారిన చందర్, తదితరులున్నారు.


మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి